# రేపటి బొమ్మలు

**ఇచ్ఛాపురపు రామచంద్రం**




నేను మీకు కమ్మని కథ చెప్పబోవడం లేదు. కథ తాలూకు లక్షణాలను కొంతవరకు ఆకళింపు చేసుకోగలిగిన నేను దీన్ని కథ అని అనడానికి సాహసించలేక పోతున్నాను. ఇది ఒక యిజమ్ (దీనికి తెలుగు పదం వాడి మిమ్మల్ని యిరుకులో పెట్టదలుచుకోలేదు. మనం కొన్ని ఆంగ్ల పదాలనే అతి త్వరగా అర్థం చేసుకోగలమని నా

విశ్వాసం). వాస్తవికత, అధివాస్తవికతల పోకడల గురించి తెలిసినా- దీన్ని ఆ కోవలోకి చేర్చడానికి ధైర్యం చాలడంలేదు. దీన్ని ఒక ప్రత్యేక రచనా ప్రక్రియ అనడమే సబబేమో!''

కథ అనగానే - జీవితంలాగే ప్రారంభం అంటూ ఉండాలి. అది మిట్టపల్లాలవెంట పరుగెత్తాలి. చివరకు ముగింపు చేరుకోవాలి. ఈ కథనంలోని విషయానికి ఆదీ అంతమూ కూడా కనుచూపు మేరలో కనిపించవు. అందుకే దీన్ని కథ అనక పోవడం.

* * *

ఒక్కొక్క క్షణం అతివిచిత్రంగా తటస్థపడుతుంది.

మనస్సునికలచి వేస్తుంది.

మెదడుని నిలబెట్టి ప్రశ్నలు వేస్తుంది.

వాటికి సమాధానాలు లభించవు.

ఇక ఆ అవస్థ పరమాత్ముడికే ఎరుక.

సరిగ్గా అటువంటి క్షణమే....అటువంటి అనుభవమే ఎదురు కావడం నా దురదృష్టం.

రోడ్డుమీద నడుస్తున్నాను.

అట్టే జనసంచారం ఉండే రోడ్డుకాదు.

అది మా వీధి తాలూకు రోడ్డే.

త్రుళ్ళిపడ్డాను.

నా మెడకి బాణంలా గ్రుచ్చుకుంది.

మరుక్షణం నేల వాలింది.

అది పక్షికాదు. పత్రం!

అది బాణంకాదు. బాణం ఆకారంలో చేయబడిన కాగితం.

ఒకరి సరసాలకు నోచుకునే వయసు కాదు నాది.

మరి - యిదేమిటి?

పరిసరాలు కలయజూశాను.

మేడమీద....బాల్కనీలో రెండు కళ్లు.

వికసించీ వికసించని నేత్రాల జంట!

ఆ నయన ద్వయంలో నేరం చేసినట్లు - పశ్చాత్తాపం.

భయపడుతున్న భావన.

క్షమను కోరుతూ చూపులు.

నేలవాలిన కాగితపు బాణాన్ని అందుకున్నాను.

ఆ బాలికను గమనించనట్లే ముందుకు కదిలాను.

బాణం నా చేతిలోనే ఉంది.

పార్కుకి చేరుకున్నాను.

ఆ పాపమీద జాలివేస్తూంది.

ఆ వయసుకి ఆ చిలిపితనం సహజమే. అర్థం చేసుకోగలను. ఆ పాప అంత భయపడటం అనవసరం.

అలవాటుగా బెంచిమీద కూర్చున్నాను.

సత్యం యింకా రాలేదు.

ఏదో పెల్తిగా ఉంది.

మనిషి స్వభావంలో అలవాటు పడిపోవడం అనేది ముఖ్యమైనది. సాధారణ మానవులలో యీ అలవాటు పడిపోడం అనే గుణం కొంచం ఎక్కువగానే ఉంటుంది. ఆ సూత్రాని కతీతుణ్ని కాను నేను.

సాయంత్రం పార్కుకి రావడం అల వాటు. మరెక్కడా తోచదు. పనులు వాయిదావేసి అయినా సరే పార్కుకివచ్చి తీరాలి. వచ్చాక - ఆ సిమెంటు బెంచి మీదే కూర్చోవాలి; కూర్చుందుకు ఏ బెంచి అయితేనేం? అలా వీల్లేదు. అలవాటుగా కూర్చునే సిమెంట్ బెంచియే కావాలి. మరోదాని మీద కూర్చుంటే తృప్తి ఉండదు. నా పక్కన, ఆబెంచీమీద సత్యం ఉండాలి. ఇద్దరమూ కబుర్లు చెప్పుకోవాలి, దీనిలో మళ్ళీ ప్రత్యేకత; ఆకబుర్లు సత్యం తోనే సాగాలి. లేకపోతే అసంతృప్తి. కారణం అలవాటు; చెప్పవచ్చేదేమిటంటే మనుషులు కొంత వయసు వచ్చాక యీ అలవాటు పడిపోవడం అనే గుణానికి ఎక్కువగా లొంగిపోతూంటారు. ఇది మంచిదో కాదో తెలియదు.

సత్యం రాకపోవటంతో ఒంటరి తనంలో ఉండిపోయాను.

చాలాప్రమాదాలకి కారణం ఏకాంతం.

మనిషి నలుగురిలో ప్రవర్తించే తీరుకీ; ఏకాంతంలో ప్రవర్తించే తీరుకీ వ్యత్యాసం ఉంటుంది. ఈవ్యత్యాసాన్నుంచి ఉద్భ వించినదే ఏమో సభ్యత? ప్రవర్తనలో నేకాకుండా ఆలోచనా వైఖరిలోకూడా మార్పు కలగజేస్తుంది ఏకాంతం.

చేతిలోని కాగితం చూడాలనిపించింది.

అదేదో ఉత్తరంలా ఉంది.

కుతూహలం!

మనిషి ఔన్నత్యానికి, పతనానికీకూడా హేతువు కుతూహలం.

ఉత్తరం తెరిచాను. ఎందుకో నావేళ్లు వణుకుతున్నాయి.

"ప్రియమైన మాధవరావుకి,

నమస్కరించి నీ ప్రేయసి విమల వ్రాయునది. నేను క్షేమముగా ఉన్నాను. నీవు క్షేమముగా ఉన్నావని తలుస్తాను. నీ దగ్గరనుంచి ఉత్తరము వచ్చి చాలారోజు లైనది. ఈమధ్య నువ్వు మా ఇంటికి కూడా రావడములేదు. నాకు విచారముగా ఉన్నది. నిన్ను చూడాలని ఎంతగానో ఆశపడుతున్నాను. నీ దర్శనము దొరుకుట లేదు. నాకు దుఃఖము వచ్చుచున్నది. నీ కొరకు కన్నులు కాయలు కాసేలా చూస్తు న్నాను.

అసలు నువ్వెందుకు రావడము లేదు? నేనంటే కోపమా? ఎందుకూ?

నీకోసం చంద్రునికొరకు కలువలా ఎదురు చూస్తున్నాను.

నా హృదయం నీకర్పించాను. అందుకు ప్రతిఫలం యిదా? నన్నెందుకిలా వేధిస్తు న్నావు? మనసు విప్పి నాతో ఒకసారి మాటలాడవా!

నీకౌగిలిలో కరిగిపోవాలని ఉవ్విళ్ళూరు తున్నాను. నన్ను చూడటానికి రావడమే లేదు నువ్వు. మనసిచ్చిన దానికి ఫలమాఇది? నేనుచేసిన నేరమేమిటి? ఇలా మూగవేదన అనుభవించ వలసిందేనా? ప్రేమించినం దుకు శిక్షాయిది?

నేను నిన్నెంతగా ప్రేమిస్తున్నానో మాటలలో చెప్పలేను. నా హృదయం అర్థం చేసుకోగలవనే ఆశతో జీవిస్తు న్నాను. నన్ను నువ్వు ప్రేమించకపోతే ఆత్మహత్య చేసుకుంటాను. అంతకంటె

మరొక త్రోవ కనిపించడము లేదు.

ఈ ఉత్తరమునకు వెంటనే సమాధానము వ్రాస్తావని ఎదురు చూస్తూంటాను.
ప్రేమతో .... విమల."

త్రుళ్ళిపడ్డాను.

ప్రపంచమంతా అంధకార బంధురమైపోయినట్లనిపించింది.

నన్నూ, నా కళ్ళనీ నేనే నమ్మలేకపోతున్నాను.

కళ్ళు చీకట్లు క్రమ్మసాగాయి.

కొన్ని నిముషాలు పట్టింది తేరుకునేసరికి.

ఇక సత్యం రాదని నిర్ధారణ చేసుకుని పార్కు బయటకు వచ్చాను.

ఏం చేయాలా అని ఆలోచిస్తూనే అడుగులు వేయసాగాను.

సాయంసమయాలు ఒంటరిగా గడపడం అతి కష్టం.

అప్రయత్నంగానే సారంగపాణి యింట్లో అడుగుపెట్టాను.

## 2

నేను వెళ్ళేసరికి సారంగపాణి యింటి వాతావరణం బాగులేదు.

ఒక అబ్బాయి ఏడుస్తున్నాడు. తల్లీ తండ్రే కాబోలు గొంతు చించుకుంటున్నారు. వరండాలో నా కోసమే అన్నట్లు వాలుకుర్చీ ఎదురుచూస్తూంది. దాన్ని ఆక్రమించుకుని సారంగపాణిని పిలిచే అవకాశం కోసం ఎదురుచూడసాగాను.

లోపల జరుగుతున్న కల్లోలం స్పష్టంగా తెలిసి రావడంలేదు.

ఏడ్పులు, కేకలు తారస్థాయినంటాయి.



కిరణ్ ప్రొడక్షన్స్ చిత్రంలో
కొత్త హీరోయిన్ రాధిక

ఏమైతే ఐందని లోపలికి నడిచాను.

అక్కడి దృశ్యం నన్ను నిశ్చేష్టుడిని గావించింది.

ఆరేళ్ళ కుర్రాడు, ముక్కుపచ్చలారని ముద్దుల అబ్బాయి గది మధ్యలో నిలబడి ఏడుస్తున్నాడు. ఆ బాలుడి కటు తల్లి, ఇటు తండ్రి. ఇద్దరి ముఖాలూ ఎర్రబడి ఉన్నాయి. వారి కళ్ళల్లో ఆవేదనా, ఆరాటమూ.

పసివాడి చెంపలు తట్లు తేరి ఉన్నాయి.

అది చూసేసరికి—నేనా తల్లితండ్రులని ఎంత మాత్రమూ క్షమించలేకపోయాను.

కుర్రవాడు తెలియక ఏదో తప్పుచేసి ఉండవచ్చు. వాడిని క్రమశిక్షణలో పెట్టడం తల్లి తండ్రుల బాధ్యతే. కాదనను. కాని-

శిక్షణకీ శిక్షకీ చాలా అంతరం ఉంది. పిల్లల పట్ల శిక్ష అనేది చాలా ప్రమాదకరంగా పరిణమిస్తుంది. శిక్షణతో సరిదిద్దవచ్చు కాని శిక్షతో ఎంతమాత్రమూ బాగు చెయ్య లేము. కొట్టడం మొదలుపెడితే పిల్లలు ఒట్టి మొండి వాళ్లయిపోతారు తప్ప ప్రయోజనం ఉండదు. పసిపిల్లల మనస్సు అతి సున్నితంగా ఉంటుంది. శిక్షణ దానిని మంచివైపు వంచుతుంది. శిక్ష - లేత మన సుని విరిచివేస్తుంది. ఇది నా ఉద్దేశం. అందుకే 'స్పేర్ ద రాడ్, స్పాయిల్ ద ఛైల్డ్' అన్న ఆంగ్లవ్యాసకర్తతో నేను పూర్తిగా వ్యతిరేకిస్తాను. అంతేకాదు, బిడ్డ లను కొట్టే తల్లితండ్రులు నా కంటికి రాక్షసుల్లా కనుపిస్తారు. పిల్లల పెంపకం అనేది మధురమైన బాధ్యత. ఈ బాధ్య తని సక్రమంగా సహనంతో నిర్వర్తించ లేని వారికి పిల్లలని కనే అధికారం లేదు.

నన్ను చూసి - సారంగపాణి తమ్ముడు భోరుమన్నాడు.

అతని భుజంమీద చెయ్యివేసి యివ తలికి తీసుకువచ్చాను.

"ఏం జరిగింది?" అడిగాను.

"…. …. …. …"

"పిల్లవాడు ఏం చేశాడు? నువ్వు విజ్ఞుడి వనుకుంటూ వచ్చా విన్నాళ్లూ. కాని .. నువ్వూ అందరిలా నేరానికి ముందు శిక్ష అని నమ్మి ఆచరించే వాడి వని భావించలేదు. ఇంతకీ - చెంపలు పగులగొట్టించుకునే అంత శిక్షకు నోచు కునే నేరం ఏం చేశాడా పసివాడు?"

"వాడు.... వాడు.... వాడిమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నామో! అవన్నీ ఏం కావాలి? వాడు దొంగ ఐపోయాడు! —"

విపరీతమైన బాధతో ఎలాగో అన్నాడా చివరిమాటలు.

కన్నుల ముందు ముళ్ళ కొరడా ఝళి పించి నట్లయింది.

గుండె బీటలు వారిందేమో అన్న భావన.

"నేను నమ్మను—" ఖచ్చితంగా చెప్పాను.

"కాని ...నిజం అదే. మొదట నేనూ నమ్మలేదు. కాని ...అనుభవాలు ఒకటా రెండా? చివరకు - ఆ చేదు నిజం నమ్మ వలసివచ్చింది."

"వాడి వయసెంత? 'దొంగ' అన్న పదం తప్పులేకుండా స్పష్టంగా వ్రాయ నయినా వ్రాయగలడనుకోను"

"అందుకే నా కింతబాధ. ఏమీ తెలి యని వయసులోనే వీడు దొంగతనం ప్రారంభించాడు.

ఈ దుర్గుణం వాడిలో వయసుతోపాటు వేళ్లు పెంచుకుని-వాడితోపాటే పెరుగుతూ- చివరకి వాడినొక గజదొంగనో, బంది పోటునో చేసి విడచిపెడుతుందేమో!"

అతని బాధ నా కర్థమైంది.

బిడ్డకి బంగారు భవిష్యత్తుకోసం సోపా నాలు నిర్మించడంలో అతను శాయశక్తులా కృషిచేసే మనిషే! కాని ఇలాగ అయ్యాక ఆ సోపానాలెవరికోసం? ఇదీ ఆ తండ్రి ఆవేదన. ఆ తండ్రిపాత్ర నిజంగా కష్ట మైనదీ, క్లిష్టమైనదీను.

"ఒక దొంగతనమే కాదు, మొండి

తిట్టుతరనా తిసెన డబ్బు లెలా ఖర్చు పెట్టాడో వాడిచేత చెప్పించలేకపోయాం!''

కన్నీరు ఆపుకున్నాను.

ఇంకా లోపలినుంచి ఆ కుర్రవాడి ఏడుపు వినపడుతూనే ఉంది.

అక్కడ ఉండలేకపోయాను

రోడ్డుమీదకు వచ్చాను.

## 3

సంగమయ్యా నేనూ ఒక వయస్సు వాళ్లమే. చిన్నప్పటినుంచీ స్నేహం. అతన్ని చూసి చాలా కాలమైంది. ఎలాగు మరొక పనిలేదు కదా అని వాళ్ళగడప ఎక్కాను.

సంగమయ్యా అతని భార్యా ఎవరి గురించో జాలిగా మాట్లాడుకుంటున్నారు.

"రావయ్యా! కూర్చో! బహుకాల దర్శనం. ఏమిటి విశేషాలు?''

''ఏమున్నయ్! ఏమయినా ఉంటే మీరే చెప్పాలి....

''సరే! విశేషం ఉంది. చెప్తాను కూర్చో! ఈ వీధిలో....అతని పేరేమిటో గుర్తులేదు....ఎర్రమోటారు సైకిలుమీద రంగేళీ రాజులా తిరుగుతూంటాడు. ఆఁ.. ఆరణి....తెలుసుగా?''

''కొంచెం తెలుసు.''

''అతనేం చేశాడో తెలుసా?''

''తెలియదు. ఏం చేశాడేం?''

''అతని వయసు నలభైపైనే. ఆవిడ ఉత్తమా యిల్లాలు. భూదేవి అంతటి ఓర్పు. ఈ వయసులో అతనేం చేశాడో తెలుసా? కాలేజి అమ్మాయిని పెళ్లిచేసు కున్నాడు. శాంతంగా ఇరవై ...

భగవాన్! ఏమిటిది? ఇవాళ ఉదయం లేస్తూ ఎవరి ముఖం చూశాను? ఒకదాని వెంట ఒకటిగా అన్నీ విపరీత వార్తలే వినిపిస్తున్నా యేం?

''మరి ఆ యిల్లాలు....''

''ఏం చెయ్యగలదు? ఉందిగా మతం మార్చుకోడం అనే తారకమంత్రం? ఆ దౌర్భాగ్యుడు మతం మార్చుకుని రెండో పెళ్ళి చేసుకున్నాడు. చట్టం ఏమీ చేయ దతన్ని.''

''అదిసరే! తనకంటె రెట్టింపు వయ సున్న మగవాడిని ...పెళ్లయి పిల్లలు కల వాడిని....అతని పెళ్లాం ఉండగానే....ఆ కాలేజి అమ్మాయి ఎలా వరించింది మూర్ఖంగా?''

''నాగరికత వేసే నాసిరకపు చిగుళ్లు. వ్యవస్థ తాలూకు కుక్కమూతి పిందెలు. స్వేచ్ఛా ప్రపంచం అనే పొలంలోని కలుపు మొక్కలు....అసలు మనం ఆలో చించవలసింది ఆ అమ్మాయి గురించీ కాదు, అతని గురించీ కాదు.''

''మరి?''

''అతనేమీ పెద్ద ధనవంతుడు కాడు. మొదటి భార్యకు ముగ్గురాడపిల్లలూ ఒక మగపిల్లవాడూ. ఆ సంసారాన్ని పోషించ గలగడమే అంతంత మాత్రం. పెద్దమ్మా యికి పన్నెండో పదమూడో ఉంటుంది వయస్సు. ఆ పిల్లపెళ్లీ....కట్నాలూ.... కానుకలూ....''

సంగమయ్య మాట పూర్తికానే లేదు.

సుడి గాలిలా వచ్చిందొక అమ్మాయి. సంపెంగ మొగ్గలా చక్కగా ఉందా అమ్మాయి.

"నా పెళ్ళి విషయం ఎవరూ ఆలోచించ నక్కరలేదు. కట్నాలిచ్చి పెళ్లిచేసుకునే కర్మ నాకేమిటి? కోరి, వేడి నన్ను ఏ ఆఫీసరో ఎగరేసుకుపోతాడు. నే నందమైనదాన్ని ..."

సంగమయ్యా నేనూ విభ్రాంతులమై పోయాం.

నెత్తిమీద పిడుగు పడినట్లు,

ఊహించని - ఆశించని - చర్య!

అమ్మాయి మెరుపుతీగెలా పక్కపోర్షనులోకి దూసుకుపోయింది.

సంగమయ్య భార్య మెల్లగా అంది. "ఆ అమ్మాయి అందమైనదే, చక్కని కంఠం కూడాను. కాస్త గర్వం అంతే! చిన్నతనం కదా? మంచీ చెడూ తెలియదు. పుల్లవిరిచి పొయ్యిలో పెట్టినట్లు మాట్లాడుతుంది. తల్లి అందమైతే పుణికి పుచ్చుకుంది కాని - ఆ వినయమూ అణకువా అబ్బలేదు...."

సంగమయ్య దగ్గరనుంచి శెలవు తీసుకున్నాను.

నా గుండెలు మండుతున్నాయి నెగడులా.

మనిషిమీద వయసుకి చాలా ప్రభావం వుంటుంది. పాతికేళ్ళవరకూ మగవాడు తన వయస్సు గురించి అబద్ధం చెప్పడు. నలభై యాభయ్యేల మధ్య తన వయసుని పెంచిచెప్తాడు. అనంతరం తన వయస్సుని తలచుకుని గర్వపడటం ప్రారంభిస్తాడు. నలభై పొలిమేరలు ప్రమాదకరమైన వంటారు శాస్త్రజ్ఞులు. రెండవ యౌవనదశగా ఉదహరిస్తారు. ఆ సమయంలో మగవాళ్లు చిత్రంగా ప్రవర్తిస్తారట. ఆరణి-రెండవ పెళ్ళి చేసుకోవడం యీకోవకే చెందుతుందేమో! భుజాలమీది బాధ్యతలు మరచి బంగారులేడి వ్యామోహంలో పరుగులెత్తడం భావ్యమా?నలభయ్యేళ్ళ వ్యక్తిత్వమూ, వివేకమూ, అనుభవమూ, జ్ఞానమూ-అన్నీ ఏగంగలో కలిశాయి? సరే. వయసు ఆరణిని అంధుణ్ని చేసి వదిలింది,

ఆ పాప?

వికసించని కుసుమం. కోరక దశలోనే ఉంది.

ప్రపంచం గురించి ఏమీ తెలియదే! జీవితపు బాటలోని రాళ్లూ రప్పలూ ముళ్లూ, ముళ్ళపొదలూ ఏమీ తెలియవే! స్త్రీ జీవితం ఎన్నివైరుధ్యాల సమన్వయమో ఆకళింపు చేసుకునే వయసు కాదు. ఆకులచాటున అణిగిమణిగి వుండవలసిన కుసుమకోరకం అకాలంలోనే పుష్పించడమా! ఈపాప మిడిమిడి జ్ఞానం ఎక్కడికి దారితీస్తుంది?

## 4

లాభంలేదు.

మెదడు నిప్పులగుండం ఐపోయింది.


ఎవరితోనయినా చెప్పకోవాలి.

నా వేదనను చల్లార్చుకోవాలి,

అంతవరకూ శాంతి వుండదు. స్తిమితం చిక్కదు.

నడుస్తున్నాను.

గమ్యమనేది లేదు.



ఆలోచనలతో పరిపరివిధాల పోతోంది మెదడు.

హటాత్తుగా ఎవరో నాచెయ్యి పట్టుకు ఆపారు.

చూశాను-ఆలోచనలనుంచి తేరుకుని.

సత్యం!

భగవంతుడే సాక్షాత్కరించినట్లనిపించింది.

గుండెల బరువు తగ్గించి మనసుని చల్లబరిచే స్నేహితుడు భగవంతుడితో సమానమే కదా?

''సమయానికి కనిపించావు. సాయంత్రం పార్కుకి రాలేదేం?''

''చిన్నపని తగిలింది. ఇంతకీ విశేషమేమిటి?'' అడిగాడు సత్యం.

సత్యం నాకంటే ఐదేళ్లో ఆరేళ్లో చిన్నవాడు. అయితేనేం, నాకంటె జ్ఞాని. లౌకికం తెలిసినవాడు, నావంటి అమాయకుడి కళ్లు తెరిపించ గలిగేవాడు. నాసందేహాలను తీర్చగలిగినవాడు. సంశయాలను నివృత్తి చేయగలిగేవాడు. అందుకే సత్యం అంటే నాకు అభిమానమూ, గౌరవమూ.

''ఈ ప్రేమలేఖ చదువు.''

''పద. అలా పార్కులోకి పోయి కూర్చుందాం. అక్కడయితే దీపాలుంటాయి''

అలవాటుగా కూర్చునే బెంచీమీద కూర్చున్నాం.

అతను ఐదు నిముషాలలో ఆ లేఖ చదివేశాడు.

''బాగానే రాసింది కొంచెం భాషా, భావమూ యింప్రూవ్ చేస్తే రచయిత్రి, కవయిత్రి కాగల సూచనలు కనిపిస్తున్నాయి.''

"ఆ అమ్మాయి కెన్నేళ్ళుంటాయనుకు న్నావు?" అడిగాను.

"ఎనిమిదినుంచీ ఏభయ్‌వరకూ ఎంత యినా వుండవచ్చు."

"ఎనిమిది కాదుకాని తొమ్మిదో పదో ఏళ్ళుంటాయి. అపాప వుండేది మావీధి లోనే."

"ఇంతకీ ఆ ప్రేమలేఖ నీకెలా వచ్చింది?"

"రోడ్డుమీద నడుస్తూంటే భుజంమీద వాలింది. మేడమీదనుంచి ఆ అమ్మాయి విసిరింది."

"నీముందుకానీ వెనకకానీ ఎవరయినా అబ్బాయి పదినుంచి పాతిక లోపు నడుస్తూ ..."

"వెళ్ళి వుండవచ్చు. నేను గమనించ లేదు."

"గురితప్పిన శరం అన్నమాట!" నవ్వాడు సత్యం.

"నా గుండెల్లో శూలంలా గుచ్చు కుంది."

"దేనికి?"

"తొమ్మిదోయేట ప్రేమలేఖ వ్రాసి- అంత ధైర్యంగా అబ్బాయి కందజేయ డానికి ప్రయత్నించిన ఆ అమ్మాయి భవి ష్యత్తుని తలుచుకుంటే భయంవేస్తూంది."

"చాలా అనవసరం."

ప్రశ్నార్థకంగా చూశాను. నా ఆవేదనని అతను గ్రహించలేదేమో అని అనుమా నం కలిగింది. మళ్ళీ అన్నాడతను. "నీ భయం నిరాధారం. ఒకవేళ దానికి ఆధార మంటూవున్నా మనం చెయ్యగలిగిందేమీ వుండదనుకోను. కొన్ని విషయాలు చెబు తాను, విను. నీవంటి ఛాందసుడికి నేను చెప్పబోయేది వింతగా ధ్వనించవచ్చు అంత మాత్రాన నామాటలు సత్యదూరా లేమో అని సంశయించ నవసరంలేదు.

ఈ నాటి ప్రేమ నీటిబుడగ వంటిదై పోయింది. ఇట్టే పుట్టి అట్టే చితికిపోతుంది. కనుక సీరియస్‌గా తీసుకో నవసరం లేదు. ప్రేమకోసం జీవితాలనీ భవిష్యత్తునీ వాడి దుడుకుల పాలు చేసుకునే పూర్వపు రోజులు కావివి. రొంప, దగ్గు వంటి సీజ నల్ డిసీజ్‌లా యీ ప్రేమ ప్రతి వాళ్ళనీ వరిస్తుంది. లవ్ రెసిస్టెన్స్ పవరున్న వాళ్లు చాలా తక్కువ ఐపోయారు లవ్ వీక్ నెస్‌కి కారణం ఎక్కువ సినిమాలూ, తరు వాత మన సాహిత్యమూ. ఈ ప్రేమ ఒట్టి ఉల్బణం. దీని గురించి భయపడ నవసరం లేదు. ప్రేమ ఒక ఫ్యాషన్ లాగే దీని వయస్సు అత్యల్పం."

"అంతే అంటావా?"

"నిశ్చయంగా."

పాముల పుట్టలాటి నా మెదడు ఒకింత తేలిక పడింది.

మరొక పాముని బయటకు లాగాను. సత్యం నాగస్వరం ఊది దాన్ని వశపరచు కుని కోరల లోని విషం తీసి బయటకు పారేస్తాడని నా ఆశ.

"మరి- ఆరేళ్లయినా లేని కుర్రాడు దొంగతనం చేశాడు" చెప్పాను.

"అది-మరీ అరుదైన విషయం కాదు. భయపడ వలసినదీ కాదు."

"ఎలా?"

"కాలం మనిషిని మార్చుతుంది. వయస్సూ స్నేహాలూ వీటి ప్రభావంలో పిల్లలు తమకి ఇష్టం లేని పనులు కూడా చేస్తూంటారు. నిజంగా అది వారి స్వభావం కాకపోవచ్చు. నువ్వు చెప్పిన పిల్లవాడికి కాస్త ఎదిగిన స్నేహితులుండి వుంటారు. వాళ్ల గురించి ఇంట్లో తెలిసిపోయి-పెద్దలు జాగ్రత్త పడి వుంటారు. అందుచేత యీ పిల్లవాడిని దొంగతనం చెయ్యమని ఆ స్నేహితులు ప్రోత్సహిస్తూ వుండవచ్చు. స్నేహితులు మారితే పిల్లవాడు బాగు పడతాడు. ఆ కట్టుదిట్టాలు అమలు పరచడమే దానికి మందు. క్రమ శిక్షణ తెలిసిన కుటుంబమే అన్నావుగా? ఆ పిల్లవాడు సన్మార్గంలో పడి తీరుతాడులే."

రెండు క్షణాల పాటు మౌనంగా ఉండి పోయాను.

"ఆరణి నీకు తెలుసా?"

"మొన్ననే అతని గురించి విన్నాను. ఘనకార్యం చేశాడు. ఆ సందర్భంలో అతను చాలా (అన్) పాపులర్ ఐపోయాడు."

"ఆ! అతనే. అతనికి ఆడపిల్లలున్నారు. పెద్దమ్మాయి వయసు పదకొండో పన్నెండో వుంటుంది. ఆ పిల్ల గురించి నూ సంగమయ్యా సానుభూతిగా మాట్లాడు కుంటూంటే హటాత్తుగా వచ్చి ఏమందో తెలుసా?"

"ఏమంది?"

"వయసుకి మించిన పలుకు పలికింది. ఏ అందం చూసి ఏ ఆఫీసరో ఎగరేసుకు పోతాడట."

"ఆత్మ విశ్వాసం మంచిదే కదా?"

"దాన్ని ఆత్మ విశ్వాసం అనడం సమంజసమేనా అని? అడియాస కాదూ?".

"ఏమో? ఆశాభావం మంచిదయినా కావచ్చు, చెడ్డదయినా కావచ్చు. తేల్చవలసింది కాలమే. మనం కేవలం ఊహించడం తప్ప ఏమీ చేయలేం. ఊహలు నిజమౌతాయో కావో?"

"మరి-ఆరణి గురించి ఏం చెప్తావు?"

"చెప్పేందు కేముంది? చాపల్యం అనే బలహీనతకి బలి అయిన వ్యక్తి. నేరమంతా అతనిదే కాదులే. ఆ అమ్మాయిది కొంత. అతని వయసుది కొంత."

"అర్థం కావడం లేదు."

"నలభై ప్రాంతాలు మగాడికి ప్రమాదకరమయిన వయస్సు. మనిషి ఆ వయస్సులో మార్పు చెందుతూ వుంటాడు. ఆ మలుపు మంచి వైపయినా కావచ్చు, చెడువైపైనా కావచ్చు. యూత్ రిపీట్స్ ఎట్ ఫార్టీస్."

"ఇంతకీ ఆ అమ్మాయి ఆరణిని మన స్ఫూర్తిగా అంగీకరించిందా? లేక, ఇదంతా ఆరణి ప్రోద్బలమేనా?"

"చెప్పలేం. ఇదొక కాంప్లెక్స్. చాలా విషయాలలో మనం పాశ్చాత్యుల ననుకరించడాని కలవాటు పడిపోయాం కదా?"

"ఊఁ."

"అమెరికాలో ఇటువంటి ఆడ పిల్లలు వుంటారుట. ఇదొక మనస్తత్వం. ఫ్రాయిడ్ థీరీ ప్రకారం ఆడ పిల్లకి తండ్రంటే ఆపేక్ష. దీన్నేదో కాంప్లెక్సంటాడు. ఆ ప్రకారం అమ్మాయికి తండ్రి ఆదర్శపురుషుడిలా కనిపిస్తాడు.

కంౘ్రిలాటి మగవాడినే పెళ్లి చేసుకోవాలను సంటారటువంటి అమ్మాయిలు. చాలా మంది యీ కాంప్లెక్స్ నుంచి బాల్యంలోనే దూరం ఔతారు. మిగిలిన వాళ్ళ మనసులో తండ్రి విపరీతమైన ప్రభావం కలిగిస్తూ వుండిపోతాడు. అటువంటి అమ్మాయిలు-వయో, రూప, గుణ గణాలలో తండ్రిని పోలిన మగవాడిని పెళ్లి చేసుకుందుకు ప్రయత్నిస్తారు. అటువంటి వారి ప్రయత్నాలు సఫలం అయితే .యిలాటి విడ్డూరాలు జరుగుతాయి. అరుణని పెళ్ళి చేసుకున్న అమ్మాయి యీ కోవకి చెందినదై వుండవచ్చు. అందుచేత-తప్పెవరిదన్న విషయం తేల్చుకోవాలంటే చాలా లోతుకి వెళ్ళాలి అది మన కసాధ్యం.''

చీకటిపడి చాలాసేపు అయింది.

కాలాతీతమైందంటూ యిల్లు చేరుకున్నాను

సత్యం సాంత్వనవచనాలు నాలో అట్టే సేపు మిగలలేదు.

భోజనంచేసి ఆరుబయట మంచంవేసుకుని మేనువాల్చే సరి కల్లా ఆ సంఘటనలు పునఃశ్చరణకావడం ప్రారంభించాయి.

వ్యవస్థా వృక్షం అంతరించిపోతూ అంత్యకాలంలో పెట్టే కుక్క మూతి పిందెలు కావు కదా!

రేపటి పౌరులు యివాళ ఎంత అన్యాయంగా ప్రవర్తిస్తున్నారు! బాల్యం దాటకుండానే సంఘచ్యుతులూ, ధర్మచ్యుతులూ ఐపోతున్నారు! వీరి నెవరు రక్షిస్తారు? ఏ వ్యవస్థ వీరికి ఆశ్రయమూ రక్షణా యివ్వగలదు? ఎటువంటి సంఘం వీరి నాదరించి చేరదీయ సమకట్టగలదు?

ఆలోచిస్తూంటే అంతా అయోమయంగా ఉంది.

ఈ ఆవేదనకి అంతూ దరీ ఉన్నట్లు తోచడం లేదు.

సత్యం చెప్పిన చివరి మాటలు నా హృదయంలో ప్రతి ధ్వనించాయి.

''తరం మారుతూంటే మనిషి ఆలోచనా దృక్పథమూ, ప్రవర్తనా మారుతూంటాయి. మనిషికి మార్పు అనివార్యం. మనిషి ననుసరించి సంఘం తాలూకు స్వరూపం క్రమక్రమంగా మార్పు తెచ్చుకుంటుంది. నైతిక సూత్రాలు సడలించబడతాయి. ఈ తరం మనుషులు రాబోయే తరం గురించి ఆలోచిస్తే అంతా అయోమయంగనూ భయంకరంగానూ కన్పించడం సహజమే. కాని ఆ భయాలు సత్యం కావు. ఏ తరాని కాతరం తనకి తగిన సంఘాన్ని సూత్రాలనీ ఏర్పరచుకోగలదు. మంచికీ చెడుకీ మధ్యనుండే గీత మనుషులు గీసుకున్నది. అది స్థిరమూ కాదు. సత్యమూ కాదు. దృక్పథాన్నిబట్టి ఆ గీత అటూ యిటూ జరుగుతూ ఉంటుంది. జీవితం ఎప్పుడూ నిర్వచనాని కతీతమే. జీవితం ఒకే గాడిలో నడవాలనుకోడం వివేకం కాదు. అందుచేత . .మన భయాలన్నీ కేవలం ఊహా జనితాలు నిరాధారాలు.''

అలా అనుకోవడం ఆత్మ వంచనే కావొచ్చు. కాని-ఆ భావనలో సుఖమూ, శాంతీ ఉన్నాయి. అందుకే ఆ రాత్రి నిద్రపోగలిగాను.

★